


# ఇనపతెర

ఎ.శ్రీధర్

సూది తన బెజ్జంలో దారాన్ని ఇముడ్చుకొని తనతోపాటే తీసుకెళ్ళి దార్లోని మలుపులు, మెలికలు, ఆయువుపట్లు అన్నీ దారానికే అప్పచెప్పి, తను వేటితోనూ సంబంధం పెట్టుకోకుండా మిగిలిపోతుంది.

దారం సూదిలో ఇమిడినట్లే ఇమిడి, దాన్తో [illegible]చే తిరిగి కీలక స్థానాలన్నీ ఆక్రమించుకొని సూదితో సంబంధం తెంచుకొంటుంది.

దారం నూలుదైనా, పట్టుదైనా, నైలాన్‌దైనా, నరానిదైనా సూదికి భేదభావం ఉండదు. అన్నిటికీ సమానంగా దారి చూపిస్తుంది.

'గురుశిష్యుల సంబంధం అలాంటిది'– అనేవారు మా అవంతం మాస్టారు.

'అయితే ఈ సూదిని నడిపే చేతుల మాటేమిటి?' అని ఎవరైనా అడిగితే గుంభనగా చిరునవ్వు నవ్వి, 'అదే–సిలబస్' అని జవాబు చెప్పేవారు. 'ఆ సిలబస్ నిర్దేశించినట్లే సూది మిమ్మల్ని నడిపిస్తుంది. మీ పని సూది బెజ్జంలో ఒదిగి దానిని అంటి పెట్టుకొని ఉండడమే.'

అతను చెప్పేది చరిత్ర, ఎకనామిక్స్.

ఈ రెండూ అనంతకాలం నుండి వస్తున్నవే కదా మరి.

అందుకే అనంతంమాస్టారు వాటిని— అనితర సాధ్యమైన నిష్ఠతో, తు.చ. తప్పకుండా చెప్పేవారు.

"తు.చలు తప్పక తొలిపల్కు చెప్పు
ఆచారమున నిష్ఠ యమల ధర్మంబు."

అన్న గణపతిముని ద్విపదే ఆయన సూక్తి.

అలాంటి మాస్టారు, హఠాత్తుగా తన అభిప్రాయాన్ని మార్చుకొని, విద్యార్థులకి రాజకీయ చైతన్యం, సామాజిక స్పృహ కూడ అవసరమేనని— అవుటాఫ్ సిలబస్ విషయాలు చెప్పటం మొదలు పెట్టారంటే....

దానికో కథ ఉండాలిగా మరి!

అనుకుంటే చెవి కోసుకొనే నేను, అవుటాఫ్-సిలబస్ అయినా - ధైర్యంచేసి అడిగాను.

కథ చెప్పమని.

మాస్టారు గుంభనగా నవ్వి చెప్పడం మొదలుపెట్టారు.

* * *

ఆ రోజు శనివారం.

ఉదయం పదకొండు గంటలకి స్నానపానాదులు ముగించుకొని వంద రూపాయల బేరర్ చెక్కువంక సంతృప్తిగా చూసి జేబులో వేసుకొని, పెద్దబజార్లోని బరోడా బ్యాంక్‌కి చేరుకొన్నాను.

చెక్ డిజానర్ అయింది, సంతకాలు కలవక.

ఉన్నట్లుండి నన్ను నిలువునా నిస్సత్తువ ఆవరించింది. ఇప్పుడేం చేయడానికీ దారిలేదు. శనివారం అయిపోయింది. మర్నాడు ఆదివారం కూడ అన్న విషయం జ్ఞాపకం వచ్చేసరికి నా అడుగులు తడబడ్డాయి.

వందలో ఎనభై నేనా అదివారం ఉదయమే అప్పు తీర్చాలి తక్కిన ఇరవైకి మనసులో వేసుకొన్న ఖర్చులు ఉండనే ఉన్నాయి. డబ్బు ఎలాగూ దొరుకుతుంది కదా అని తిరిగిరావడానికి బస్సుఛార్జీలు కూడా పట్టుకురాలేదు.

ఏం చెయ్యాలో తోచక బజారు రోడ్డు దాటి పార్కులోకి దారితీశాను.

డబ్బు దొరికిఉంటే ఆ పార్కు ముఖాన్ని చూసేవాడినే కాదు. ఇప్పుడదే శరణ్యమయింది! జేబులో ఉన్న ఆఖరి చార్‌మినార్ కాల్చేసి సరి కూర్చోలేక అలాగే పచ్చికమీద వాలిపోయి ఆలోచించసాగాను.

నేను ఖాళీసిగరెట్టుపెట్టె పారేయడం చూశాడల్లే ఉంది. పాన్-బీడీలు అమ్మే కుర్రాడు నాకు దగ్గరగా వచ్చి కూర్చొని సామాను సర్దుకోసాగాడు. వాడివైపు

చూసే ధైర్యంలేక నేను కళ్లు మూసుకొన్నాను. కానేపటికి ఎవరిదో పిలుపు వినిపించి, వాడు వెళ్ళిపోయాడు. నేను కళ్ళు తెరవలేదు— అలా మూసుకొనే ఉన్నాను. సిగరెట్టు వచ్చి వెళ్ళిపోయింది. అందుకొనే తాహతు నాకు లేకపోయింది. శనివారం కాక మరోరోజు అయివుంటే, చెక్కు వాపస్‌చేసి ఏదో ఒకటి చెయ్యగలిగి ఉండేవాడిని. ఇప్పుడేమీ చెయ్యలేను. పైపెచ్చు రేపు ఆదివారం.

అంతలో ఏదో చప్పుడు వినిపించింది. అగ్గిపుల్ల రాపిడిచేసి వెలిగించిన చప్పుడు. ఆ వెంటనే సిగరెట్టు పొగ ముక్కుపుటాలని తాకింది. అబ్బ! ఏమిటీ సిగరెట్టు! నన్ను వదలనంటుందేం! అనుకొంటూ కళ్లువిప్పి చూశాను.

నా పక్కనే కూర్చొని ఉన్నాడొక యువకుడు. నేను కళ్లు తెరవడం చూసి "మాస్టారూ!" అని పిలిచాడు.

నేను లేచి కూర్చొన్నాను.

అతను సిగరెట్టు పెట్టె నా ముందుకు తోసాడు, "తీసుకోండి మాస్టారూ!" అంటూ.

"ఎవరు బాబూ మీరు!" నే నతని వంక తేరిపార చూసాను. "నువ్వు.... నువ్వు.... రుద్రమూర్తి అన్నయ్య కొడుకవి జ్ఞానివి కదూ?"

"ఔను మాస్టారూ! నేనే ఆ జ్ఞానే శ్వర్ ని— రుద్రమూర్తి బాబాయి పెట్టిన పేరే అది."

"ఎప్పటిమాట!" సిగరెట్ వెలిగిస్తూ అన్నాను. "రుద్రమూర్తి, పాపం...."

"పోలీసుల కాల్పుల్లో ఎంతోమంది నక్సలైట్లు పోయారు మాస్టారూ! మా బాబాయి కూడ అందులో ఒకడు..." నా మాట మధ్యలోనే తుంచేశాడు అతను.

రుద్రమూర్తి ప్రసక్తి అతని కిష్టం లేదని గ్రహించాను. "బాబూ నువ్విప్పుడూరికి ఎప్పుడొచ్చావ్?"

"వచ్చి నెలరోజులే... అయ్యాయి మాస్టారూ! మీ దగ్గరకే రావాలనుకొంటున్నాను...."

"నా అవసరం ఏమొచ్చింది బాబూ!"

"నేను పరీక్షకు కూర్చోవాలనుకొంటున్నాను మాస్టారూ! మీ దగ్గర లెక్కలు నేర్చుకోవాలని...." అని అంటూ జేబులోంచి వందరూపాయల నోటు తీశాడు జ్ఞాని. "మాస్టారూ, ఇది ఎడ్వాన్సు కింద ఉంచండి, నేను రేపటినుంచి ట్యూషన్‌కి వస్తాను."

నేనా నోటువంక, అతనివంక, మార్చి మార్చి చూశాను. 'రుద్రమూర్తి, నేనూ సహాధ్యాయులం. జ్ఞాని నా కళ్ళముందు పెరిగినవాడు. వాళ్ళది చాల రాయల్ ఫేమిలీ! జ్ఞాని మేనమామ గొప్ప వక్త. కుల, మత, వర్గ విభేదాలకి ఎదురునిల్చి

మనిషి అధఃపతనానికి అవే కారణాలంటూ- పండితులు, ముల్లాలు, పాదరీలే సమాజ శత్రువులంటూ వాళ్ళపై దాడిచేసి చీలికలు తెస్తున్నాడనే నెపంమీద బ్రిటిష్ ప్రభుత్వంచేత నిర్బంధింపబడ్డాడు. ఆ తరువాత తన జీవితకాలమంతా విదేశీ ప్రభుత్వాన్ని పడగొట్టే విప్లవచర్యలలో పాల్గొని ప్రాణాలు విడిచాడు. అలాంటి వంశానికి వారసుడు జ్ఞానేశ్వర్. వాడికి చదువు చెప్పేందుకు నేను డబ్బు తీసుకోవాలా?" ఆ మాటే అడిగాను.

"బాబూ, నీ మేనమామ, బాబాయి చేసిన సేవలకి ఈ సమాజం ఏనాడూ ఋణం తీర్చుకోలేదు. కనీసం నాకైనా ఆ అవకాశం...."

"మాస్టారూ!" జ్ఞాని మధ్యలోనే నా మాట తుంచేశాడు. "మీ చెక్కు డిస్ ఆనర్ అయింది. బేంక్‌నుండి బయట పడ్డ మీరు ఇంటికి వెళ్ళకుండా ఇలా పచ్చగడ్డిపైన వాలిపోయారంటే.... మీ అవసరం ఎలాంటిదో తెలుస్తూనే ఉంది. నేను నా అవసరంకొద్దీ మిమ్మల్ని వెతుక్కుంటూ, ఈ సమయంలో వచ్చాను మిమ్మల్ని చెప్పమని అర్థించింది ఆర్థిక శాస్త్రం మాస్టారూ! దాన్ని ఇలాగా మీరు చెప్పేది?.."


నాకు జ్ఞాని కొద్దికొద్దిగా అర్థమయ్యాడు.

'అతనికి మామయ్య బాబయ్యల ప్రసక్తి తేవడం ఇష్టంలేదు. వాళ్ళు నమ్మి ఆచరించిన సిద్ధాంతాలపట్ల ఇతనికి తిరస్కారం గాని, విరోధం గాని ఉంది. ఇతను అర్థశాస్త్రాన్ని అభ్యసించడమే కాదు. ఆచరణలో కూడ పెట్టదలచుకొన్నాడు. నేను నోటు తీసుకోకపోతే మరోచోటికి పోతాడేమో! పక్కా మెటీరియలిస్టా లేక ఇంకేదైన ఇజాలమత్తులో ఉన్నాడా? కొన్నాళ్ళు కనిపెట్టి చూస్తే ఏం పోయింది?'

నేను జ్ఞాని చేతిలోంచి నోటు అందుకొంటూ అన్నాను, "సరే బాబూ! రేపు సాయంత్రానికి రా!"

జ్ఞాని నమస్కారంచేసి వెళ్ళిపోయాడు.

పది రోజులు ట్యూషన్ చెప్పేసరికి నాకు తెలిసిపోయింది. ఆ రోజు జ్ఞాని అడిగినదంతా నాటకం. అతనికి అర్థశాస్త్రం నేను చెప్పనక్కరలేదు, నాకే అతను చెప్పగలడు. ఎప్పుడూ సిలబస్ దాటి పాఠం చెప్పని నన్ను, చరిత్రవైపు, రాజకీయాలవైపు మళ్ళించేవాడు. మనిషి దుస్థితి- కులమత వర్గ విభేదాలు, విదేశీ ఆక్రమణలు, బూర్జువా ప్రభుత్వ విధానాలు కారణాలు కావనేవాడు. వాళ్ళ మామయ్య బాబయ్యలు సమస్యల్ని ఒక్కో కోణంనుంచి చూశారేకాని




పూర్తిగా చూడలేకపోయారని అన్నాడు.

కులం, మతం డబ్బుముందు ఎలా తలవంచాయో, చరిత్రనుండి ఉదాహరణలు తీసి చూపించాడు. ఆకలనేది మనిషి ముఖ్యావసరమే అయినా, సామ్యవాదం వచ్చి దాన్ని తీర్చేసినంతమాత్రాన సమాజం బాగుపడిపోదు – అన్నాడు.

నాకు కోపంవచ్చి వందనోటు అతని ముఖాన కొట్టాను. "జ్ఞానీ! నీకు ఏకనామిక్స్ నేర్పి నన్ను నేను వంచించుకోలేను. ఆ డబ్బు తీసుకొని బయటకు నడు" అంటూ.

జ్ఞాని మారుమాట్లాడక ఆ నోటు అందుకొని వెళ్ళిపోయాడు.

* * *

"మాస్టారూ! జ్ఞాని వాదనలో తప్పేముంది. మీరు చెప్పిన కథ ప్రకారం అతని కుటుంబం ఆ సిద్ధాంతాలకి ప్రయోగశాల అయింది. వాటి ఫలితాలు కని విని జీర్ణించుకొన్న తత్వం అతనిది."

"నిజమే బాబూ! అతను పరిధిదాటి మాట్లాడడం నేను సహించలేక ఆవేశపడ్డాను గాని, నా మనసు అతనికోసం పీకుతూనే ఉండేది. మళ్ళీ అతన్ని చూడాలని ఆరాటపడ్డాను. దానికి మరో కారణం కూడా ఉంది."

"ఏమిటా కారణం మాస్టారూ?"

"మా అమ్మాయి ఆశాలత."

నేను ఆశ్చర్యంతో చూడడం గమనించి మాస్టారు చిరునవ్వు నవ్వారు.

"ఆడపిల్ల తండ్రి ఆరాటం నీకు తెలియదు బాబూ! ఆశ ఎస్.ఎస్.సి ఫస్ట్ క్లాస్‌లో పాసయింది. అందమయినదే అయినా బాగా పొట్టి. ఆ పొట్టివల్ల ఒళ్లు

గా మా కనిపిస్తుంది. దానికి వరుణ్ణి ఎలా తెమ్మంటావు చెప్పు! స్కూల్ ఫైనల్ చదువుతున్నప్పటినుంచి సంబంధాలు చూస్తూనే ఉన్నాను. పెళ్ళిచూపులు చాల అయి పిల్ల నచ్చక విఫలమయ్యాయి. దాని పెళ్ళి ఎలా అవుతుందో అన్న బెంగ పతనరాన పట్టేసిన నాకు, జ్ఞానిని వెళ్ళగొట్టిన తర్వాత జ్ఞానోదయం అయింది. ఆమెకి పెళ్ళంటూ జరిగితే అలాంటి వరుడే చేసుకొంటాడన్న నమ్మకం రాను రాను బలపడి జ్ఞానికోసం తపనపడ్డాను. అతన్తో పరిచయమే నాటకీయంగా జరిగింది. ఎక్కడుంటాడో నేను కనుక్కోలేదు."

"మరేం చేసారు మాస్టారూ!"

"తిరిగి ఆ బేంక్ దగ్గరకే వెళ్ళి వెతకదల్చుకొన్నాను. పాస్‌బుక్ పట్టుకొని, ఆ వ్యక్తిని కూడా వెంటబెట్టుకొని వెళ్లాను ఎందుకంటే జ్ఞాని వచ్చిన పది రోజుల్లోనూ అత ఇంట్లో లేదు. అత నామెను చూడటం జరగనేలేదు. మూడు రోజుల తర్వాత రాబోయే తన పుట్టిన రోజుకి, నేనేదో కానుక - కొంటానని పిచ్చిపిల్ల నాతోపాటు ఉత్సాహంతో వచ్చింది."

"జ్ఞాని కలిసాడా మాస్టారూ?"

"కలిసాడు. బేంకునుండి 60 రూపాయలు డ్రాచేసి తిరిగి వస్తూంటే గుమ్మం దగ్గర ప్రత్యక్షమయ్యాడు. నా హృదయం సంతోషంతో ఉప్పొంగింది. అతని అతనికి పరిచయంచేసి డ్రా చేసిన డబ్బు అతని చేతికిచ్చి, ఏదైనా తన కిష్టమైనది కొనుక్కోమని చెప్పి పంపించేసి జ్ఞానిని నాతోపాటు అదే పార్కుకు తీసుకెళ్లాను, మాట్లాడాల్సిని విషయాలు చాలా ఉన్నాయంటూ."

పార్కులో తిరిగి అదే జాగాలో కూర్చొన్నాక జ్ఞాని అడిగాడు, "మాస్టారూ నాతో ఏదో మాట్లాడాలన్నారు?" అని.

"జ్ఞానీ! ఆ తరువాత నువ్వు మా ఇంటికి రానేలేదు, కోపం వచ్చిందా బాబూ!"

"లేదు మాస్టారూ! నామీద మీ కోపం చల్లారేవరకూ రాకూడదనుకొన్నాను."

"అది చల్లారిందీ లేనిదీ ఇంటికి రాకుండా ఎలా తెలుసుకోగలవు?"

"తెలుసుకోగలను మాస్టారూ!" అని కాసేపు ఆగి, "మీ శిష్యులద్వారా తెలుసుకోగలను" అన్నాడు.

జ్ఞాని లాజిక్కు అర్థమయి గలగలా నవ్వేశాను. "ఆవేశంలో అలా అన్నానే గాని నీమీద కోపం ఎందుకు బాబూ! ఏ గురువుకైనా వన్నెతెచ్చే విద్యార్థివి."

"మరయితే...." దపిగాడు జ్ఞాని.

"నువ్వు అవుటాఫ్ సిలబస్ మాట్లాడటం నాకు ఆవేశాన్ని తెచ్చిపెట్టింది.

నా దృష్టిలో విద్యార్థికి....."

"సబ్జెక్ట్ పైన తప్ప రాజకీయచైతన్యం సామాజిక అవగాహన ఉండకూడ దంటారు."

నేను జవాబివ్వలేదు.

"సరే మాస్టారూ! మనిద్దరం ఒకరి అదర్శాల జోలికి మరొకరం పోవద్దు. ఇప్పుడు చెప్పండి నాతో ఏం మాట్లా డాలో?"

"బాబూ!" నా కంఠం అసలు విషయం దగ్గరికి వచ్చేసరికి గాద్గదికమయింది. "విషయం నీతో ఎలా చెప్పాలో....."

"మాస్టారూ!" జ్ఞాని నా ముఖంవంక తేరిపార చూసి అన్నాడు. "మీ ఆత్మాభి మానం ఎంత గొప్పదో నాకు తెలుసు. నన్నేదో ఫేవర్ అడగాలని వచ్చారు కదూ! అడిగి మీ అభిమానాన్ని చంపుకో వద్దు!.... అజ్ఞాపించండి చాలు."

అతని మాటలకి నేను చలించి పోయాను. జ్ఞాని ఎంత తెలివయినవాడు. ఆశ ఇతనికి సరైన జోడి అవగలదా! నా స్వార్థంతో నేనీ నమ్రతామూర్తిని బలిపెయ్యడంలేదు కదా!"

"బాబూ!" ఎలాగో కొంతసేపటికి గొంతు పెకలించుకొని అన్నాను. "ఆశని చూశావు కదా! పొట్టిగా ఉండటం మూలాన దాని పెళ్ళి జరగడంలేదు.... ఎవరైనా మంచి వరుణ్ణి ..." నాకు తెలియకుండానే నా మాటలు మారి పోయాయి.

జ్ఞాని ముఖం చిరునవ్వుతో వెలిగి పోయింది. "మాస్టారూ! మీ ఉద్దేశం నాకు అర్థమయింది. నన్ను మీ అల్లుణ్ణిగా ఎన్నుకోడం మీ సహృదయతకి నిద ర్శనం. ఆశలో ఏం లోపం ఉందని మిమ్మల్ని మీరు కించపర్చుకొంటున్నారు! పొట్టి పొడుగుల భేదం శరీరానికి గాని ఆత్మకి ఎక్కడుంది దేహమంతటా వ్యాపించిఉండే ఆత్మ, ఆ దేహంలో ఏదో ఒక చెయ్యో, కాలో విరిగిపోతే అక్కడికక్కడ కుంచించుకుపోయి, తక్కిన భాగంలో విస్తరిస్తుంది. అందుకే అంధులు, వికలాంగులలో ఆత్మబలం ఇంకా ఎక్కువగా ప్రస్ఫుటమవుతూ ఉంటుంది. పొట్టివాళ్లు బహు గట్టివాళ్ళు అన్న సామెత ఊరికినే పుట్టలేదు మాస్టారూ! ఆ లెక్కప్రకారం మీ ఆశ తక్కిన అమ్మాయిలకన్న ఎన్నో మెట్లు ఎక్కువలో ఉన్నట్లే....."

"బాబూ! నా మనసులో మాట గ్రహించావ్. జీవిత భాగస్వామిని ఎన్ను కొనే విషయంలో ఎలాంటి ప్రలోభాలకి నువ్వు లోనుకావని నాకు అనిపించింది. అందుకే చెప్తున్నాను, ఆశతో ఒకటి రెండు మాటలు మాట్లాడి మీ అభిప్రా యాలు కలుస్తాయో లేవో! కనిపెట్టు, అ

పైనే నాకు కబురుపెట్టు." సంతోషంతో ఉప్పొంగిన హృదయం ఆ మాట అన్నాక దూదిపింజలా తేలికగా కూడ అయింది.

"మాస్టారూ! అభిప్రాయాలు కలవాలి గాని, కలిస్తేనే పెళ్ళిచేసుకోవాలని గాని రూలెక్కడుంది! ఒకరి అభిప్రాయాలు మరొకరితో ఎల్లకాలమూ ఎలా కలుస్తాయి! అవి రైలుపట్టాలలా సమాంతరంగా ఉన్నా సరే! ఎదుటివారి అభిప్రాయాల్ని గౌరవించగలిగే సహనమనే స్లీపర్లు ఉంటే చాలు, సంసారశకటం సాగిపోవడానికి. మీ కోరిక ప్రకారం ఆమెతో ఒకటి రెండు మాటలు మాట్లాడుతాను, నా కోసం కాకపోయినా ఆమె కోసం."

మొదటిసారి వందరూపాయలనోటు ఎలా నా చేతపెట్టి వెళ్ళాడో అలాగే ఈ హామీనోటు కూడ ఇచ్చి వెళ్ళాడు జ్ఞాని. బాబూ, ఇది జరిగి వారంరోజులే అయింది. జ్ఞానిలో సబ్జెక్టే కాక రాజకీయ చైతన్యం, సామాజిక పరిశీలనలతోపాటు ఫిలాసఫీ కూడ చోటుచేసుకోడం నన్ను ఆశ్చర్యపరిచింది. అప్పటికిగాని నా సిలబస్ గీటురాయిపైన మోజు ఎంత పనికి మాలినదో నాకు అర్థంకాలేదు" అన్నారు మాస్టారు.

* * *

ఆశాలతని పెళ్ళికూతురు ముస్తాబులో చూడాలనే ఉబలాటం, మాస్టారి మాటెలా ఉన్నా నాకూ ఉండేది. — నెలరోజులు దాటిపోయినా ఆ ప్రయత్నమేదీ కనిపించకపోవడం నాకు ఆశ్చర్యంకలిగించింది.

మాస్టారి ముఖం రాను రాను గంభీరంగా ఉదాసీనంగా మారిపోవడం సంశయాన్ని పుట్టించింది. అతన్ని అడిగే ధైర్యంలేక. జ్ఞానేశ్వర్‌ని వెతికి పట్టుకొని అడిగాను.

"జ్ఞానీ, ఆశతో నీ పెళ్ళి ప్రస్తావన ఎంతవరకు వచ్చింది!"

అతను పెద్ద నిట్టూర్పు విడిచి చెప్పాడు "దానికి ఇనపతెర పడిపోయింది" అని.

నేను నివ్వెరపోయాను. ఏమిటా ఇనపతెర! అతనికి సంబంధించినంతవరకు— అమ్మాయి అందచందాలు, కట్నకానుకలు అభిప్రాయభేదాలు ఏవీ కూడా ఆ 'తెర' కానేరవు. ఇవి కాక ఇంకేముంటాయో నా ఊహకి అందలేదు.

జ్ఞానేశ్వర్ చెప్పసాగాడు

ఆ రోజు ఆదివారం.

ఆశ కొండమీద గుడికెళ్తూ కన్పించింది. గుసగుసలాడుతూ గుడిమెట్లు ఎక్కుతూఉంటే— పూచిన బాలమందార వృక్షంలా ముచ్చటగా కన్పించింది. ఆ అమ్మాయి బి.ఎస్‌సి ఫస్టుక్లాసులో పాస

ఉండట. ఫ్రాక్ గాని తొడిగిఉంచే సర్టిఫికేట్ తెచ్చి చూపించినా ఎవరు నమ్మేవారు కాదేమో అనిపించింది.

నేను కొండ దిగువనే ఆగాను. తిరిగి వచ్చేటప్పుడు ఒకటి రెండు మాటలు అడదామని.

కాసేపటికి తిరిగివస్తూ దార్లో నన్ను చూసి పలకరింపుగా నవ్వింది.

"ఆశా! కాసేపు ఆ బండమీద కూర్చొందామా! నీతో కొన్ని విషయాలు మాట్లాడాలి" మౌనంగా తలవూపి నన్ను అనుసరించింది.

రాయిమీద కూర్చోగానే ఆశ తలఎత్తి నా వంక చూసి, తనవంక చూసుకొంది.

"ఏం చూస్తున్నావ్ ఆశా, ఎత్తులో తేడాలా?"

ఆశ తలదించుకొంది, "అవును నేను బాగా పొట్టి. బహుశా ఎవరితోనూ జత పడనేమో!"

నేను వెంటనే లేచి ఆమెకన్నా బాగా దిగువనున్న ఒక రాయిమీద కూర్చొంటూ అన్నాను. "ఇప్పుడు చూడు, తేడా ఎలా ఎగిరిపోయిందో" అని.

ఆశ నవ్వింది. "మీరు బరోడా బేంక్‌లో అటెండర్‌గా పనిచేస్తున్నారు కదూ! నిన్ననే యూనిఫారంలో చూశాను."

"అవును, నీతో తొలి పరిచయం అయినప్పటికి నా కింకా యూనిఫారం ఇవ్వలేదు, మొన్ననే ఇచ్చారు."

"ఫరవాలేదులెండి. మీ చదువు పూర్తయ్యాక వేలకి వేలు గడించగలరు" అంది.

"నేను గడించలేకపోయినా నువ్వు సంపాదించగలవు ఆశా! నీ క్వాలిఫికేషన్‌కి మంచి ఉద్యోగమే దొరుకుతుంది."

ఆశ ఈసారి మధురంగా నవ్వింది. "అవును. ఇద్దరం కలిసి బోలెడు డబ్బు సంపాదించవచ్చు. ఎంతో హాపీగా లైఫ్ ఎంజాయ్ చేయవచ్చు" అంది. ఆ మాట లంటున్నప్పుడు ఆమె ముఖం మతాబాలా వెలిగిపోయింది. అలా వెలుగుతున్న ఆమె అందమైన ముఖంలో ఆశా ధూమాన్ని తొలిసారిగా చూడగలిగాను.

కాసేపటికి తేరుకొని అడిగింది. "ఏదో మాట్లాడుతానన్నారు!"

"అవును. కాని ఏం మాట్లాడాలో నాకు తోచడంలేదు." నిజమే! పొగ గొంతుకకి అడ్డంపడితే మాటలేం తోచుతాయి!

"భలేవారే! మీరు ఎంతో బాగా మాట్లాడుతారని నాన్నగారు చెప్పారు" అని గలగలా నవ్వింది.

నేనేదో అనబోయాను. కాని ఇంతలో ఆ దారంట పోతున్న ఒక రిక్షాలోని

మైకునుంచి, "భాగ్యలక్ష్మి లాటరీ టికెట్టు కొనండి. రెండే రెండు రోజులలో మీ అదృష్టాన్ని పరీక్షించుకోండి. భాగ్యలక్ష్మి ఇప్పటివరకు పాతికమందిని లక్షాధికార్లుగా చేసింది. మీరే ఆ **26వ వ్యక్తి** ఎందుకు కాకూడదు! ఈసారి డ్రా మీ జిల్లా ముఖ్యపట్టణంలోనే మీ కళ్ళముందే జరుగుతుంది ప్రఖ్యాత అభినేత్రి, అందాల అపరంజి బొమ్మ కుమారి శ్రీదేవి తన స్వహస్తాలతో లాటరీ డ్రా తీస్తుంది. ఈ అవకాశాన్ని వదులుకోకండి. బంపర్ ప్రైజ్ రెండు లక్షలు!! త్వరపడండి ఇంక రెండే రెండురోజుల్లో....."అంటూ.

లాటరీ టికెట్లు ఉన్న పేడ్ పట్టుకొని, ఒక కుర్రాడు మా దగ్గరకి కూడ వచ్చాడు.

ఆశ తన గుప్పెట్లో ఉన్న పర్సులోంచి రూపాయి తీసి, టికెట్ తీసుకొంది. "విన్నారా! ఈసారి శ్రీదేవి డ్రా తీస్తుందట! అదృష్టం ఎవరిని వరిస్తుందో మరి!" అంది.

నేను కష్టంమీద గొంతు పెగల్చుకొని అడిగాను, "ఆశా ఆ లాటరీ టికెట్టు ఎందుకు కొన్నావ్?"

"ఎందుకేమిటి? అదృష్టాన్ని పరీక్షించుకోడానికి. రెండే రెండు రోజుల్లో! ఏం నేను గెలిస్తే అది మీ గెలుపు కాదా?" అంటూ కిలకిలా నవ్వింది.

ఆమెని పూర్తిగా నవ్వనిచ్చి అన్నాను. "సరే! ఆ లాటరీ నిన్ను వరించిన నాడే నేను నిన్ను పెళ్లాడుతాను" అని.

తను క్షణకాలం నివ్వెరపోయి, తరవాత నా వైపు చురచుర చూస్తూ అంది. "అవసరం లేదులెండి, లాటరీ నాకు తగిలాక మీలాంటి బేంక్ అటెండర్‌ని పెళ్ళాడాల్సిన ఖర్మ నాకేంటి? నాన్నగారు మిమ్మల్ని పెద్ద ఆదర్శవాది అనుకొంటున్నారు. మీ నైజం ఇప్పుడు తెలిసింది." అంటూ లేచి వెళ్ళిపోయింది.

"అదే మా మధ్య పడ్డ ఇనపతెర!" అంటూ జ్ఞాని కూడ లేచి వెళ్ళిపోయాడు.

